క్లుప్తంగా

ఘనంగా కాళికామాత ఆలయ ప్రారంభం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గొలుగొండ: చీడిగుమ్మలలో నూతన కాళికా మాత ఆలయ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, ఇతర ప్రాంతాలకు చెందిన దాతల సహకారంతో ఈ ఆలయాన్ని ఇటీవల కమిటీ నిర్మించింది. తెల్లవారు నుంచి ఆలయం వద్ద పండితులు పూజాధికాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడం కోసం వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న వైస్ ఎంపీపీ, తదితరులు

మాకవరపాలెం: ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతోనే సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి తెలిపారు. విద్యా దీవెన నగదు విడుదల నేపథ్యంలో గురువారం తామరం గ్రామ సచివాలయంలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎంకు అందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ అయ్యన్న, పార్టీ నాయకులు నారాయణరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

మాకవరపాలెం: సారా విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. తూటిపాలకు చెందిన రుత్తల చినరాజు సారా విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో గురువారం దాడి చేశామన్నారు. ఈ దాడిలో 17 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు హోమియో మందుల పంపిణీ



హోమియో మందు అందజేస్తున్న కామేశ్వరావు

మాడుగుల రూరల్: జి. అగ్రహారం హైస్కూలు, ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు ఉచిత హోమియో మందులు గురువారం పంపిణీ చేశారు. వడ్డాది గ్రామానికి చెందిన అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం 300 మంది విద్యార్థులకు హోమియో మందుతోపాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరావు పంపిణీ చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం ఎ. లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగులలో భారీ వర్షం

మాడుగుల: మండలంలో ఈదురుగాలులుతో కూడిన భారీ వర్షం గురువారం సాయంత్రం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మామిడి కాయలు నేల రాలిపోయాయిని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్షం చెరకు కార్షి తోటలకు కొంత మేలు కలిగిందని చెప్పారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ చేసిన నాయకులు

రావికమతం: పి.పొన్నవోలు గ్రామంలో మాజీ సీఎం ఎన్టీ రామారావు విగ్రహాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్ రాజు గురువారం ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, తెలుగు ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు రాజాన కొండనాయుడు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ నివారణ



రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి



రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న శారదాబాయి

మాకవరపాలెం: అవగాహనతోనే క్షయ వ్యాధిని నివారించొచ్చని లెప్రసీ, క్షయ నివారణ జిల్లా అధికారి శారదాబాయి తెలిపారు. మండలంలోని బూరుగుపాలెం, మాకవరపాలెం పీహెచ్‌సీల పరిధిలోని 40 మంది క్షయ రోగులకు గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిక్షయ యోజన పథకంలో భాగంగా ఫార్మా కంపెనీల సహకారంతో ఉచితంగా పౌష్టికాహారం అందజేస్తున్నట్టు తెలిపారు. వైద్యాధికారులు శ్రీవిద్య, చరిష్మ, సిహెచ్‌వో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రహిత దేశమే ప్రభుత్వ లక్ష్యం

చోడవరం రూరల్: క్షయ రహిత దేశంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చోడవరం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ కె.వినయ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా చోడవరం ప్రాంతీయ వైద్యాలయం, గవరవరం, చీడికాడ, పెదగోగాడ, వేచలం పీహెచ్‌సీ పరిధిలోని 59 మంది టీబీ రోగులకు ఉచితంగా రేషన్, ప్రొటీన్ ఆహార పదార్థాలు, మూడు రకాల పప్పు దినుసులు, రాగిపిండి, కొమ్ముశనగలు, నూనె వంటి ఎనిమిది రకాల ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో చోడవరం సీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డి.దమయంతీదేవి, చోడవరం టీబీ యూనిట్ వైద్యాధికారి డి.అప్పారావునాయుడు క్షయ వ్యాధి లక్షణాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గవరవరం పీహెచ్‌సీ పరిధిలో 20 మంది రోగులకు పోషకాహార కిట్లు అందచేసినట్టు వైద్యాధికారి తెలిపారు. సీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

దేవరాపల్లి: క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి బి. హారిక అన్నారు. వేచలం పీహెచ్‌సీ పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను గురువారం ఆమె పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రతి నెలా పౌష్టికాహారం అందిస్తున్నామని, ప్రభుత్వం రూ.500 చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తుందని పేర్కొన్నారు.

అందరికీ ఆరోగ్యం సీఎం జగన్ లక్ష్యం



పొడుగుపాలెంలో వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న ఎంపీటీసీ గౌతమి



దొర్లవీధిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శివప్రసాదుపాత్రుడు

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంతో ప్రజలందరికి మంచి వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎ.కోడూరు ఎంపీటీసీ లెక్కల గౌతమి తెలిపారు. గురువారం పొడుగుపాలెంలో ఫ్యామిలీ డాక్టరు సేవలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో 86 మందికి వైద్యంతోపాటు బి.పి, సుగర్ పరీక్షలను లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి నిర్వహించారు. ఇళ్లకు వెళ్లి 12 మంది రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, లెక్కల శంకరరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: స్థానిక దొర్లవీధిలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్ ప్రసాదుపాత్రుడు ఆధ్వర్యంలో 96 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం దీర్ఘకాలిక రోగులను పరీక్షించారు. ఎంపీహెచ్ఈవో పి. రవికుమార్, హెచ్.వి. పి.హేమమాలిని, ఎంఎల్‌హెచ్‌పీలు బి. శ్రీలత, డి. భవానీ, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలు తీవ్రత తగ్గే వరకు జాగ్రత్తలు



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: ఎండల తీవ్రత తగ్గేంత వరకు వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద గురువారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 88 మందిపైగా రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి వచ్చినప్పుడు మా సమయం వృధా చేయకుండా వైద్య సేవలు పొందాలని సూచించారు. సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలి

సాగుదారులతో ఆర్డీవోను కలిసిన ఎమ్మెల్యే గణేష్



రైతుల సమస్యపై ఆర్డీవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆర్డీవో హెచ్.వి.జయరాంను కోరారు. నాతవరం మండలం మాధవనగరం గ్రామానికి చెందిన 180 మంది రైతులను వెంటబెట్టుకుని గురువారం ఆర్డీవోను కలిశారు. సాగు భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటున్నా, పట్టాదారు పాసు పుస్తకాలు లేక రైతు భరోసాతోపాటు పలు ప్రభుత్వ రాయితీలు రైతులకు అందటం లేదని వాపోయారు. పండించిన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు పట్టాలు మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆర్డీవో బాధితులకు హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, గ్రామ సర్పంచ్ సోము చింతల్లి, ఎస్.రమణ పాల్గొన్నారు.

నేడు దిబ్బిడిలో 'గడప గడపకు'

బుచ్చెయ్యపేట: దిబ్బిడి గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు: ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ప్రజలు చర్యలను చేపట్టాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం సింగన్నదొరపాలెంలో దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. వారం రోజులకు పైగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంటే తొలగించాలని సూచించారు. మురుగునీటిలో దోమలు లార్వాతో అవి వృద్ధి చెంది మలేరియా సోకడానికి కారణమవుతాయన్నారు. ప్రజలు విధిగా ప్రతీ ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎస్.రాజు, ఏఎన్ఎం చిన్నమ్మలు పాల్గొన్నారు.

29లోగా పాఠశాలల్లో స్థితిగతుల నమోదు

- హెచ్ఎంలకు ఎంఈవో మధుమూర్తి సూచన



మాట్లాడుతున్న ఎంఈవో మధుమూర్తి

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మౌలిక వసతుల వివరాలను సంబంధిత యాప్‌లో ఈ నెల 29వ తేదీలోగా నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో టి.మధుమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమూర్తి మాట్లాడుతూ గతంలో ప్రస్తుతం పాఠశాలల్లో తరగతుల పరిస్థితితోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాల ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్, తాగునీటి కల్పన, మెడికల్ కిట్, ఫిర్యాదు బాక్సు ఏర్పాటుతో మొదలగు 77 అంశాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పీఎంసీ కమిటీ చైర్మన్, సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ రిసోర్స్ పర్సన్ బి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తకోట కాలేజీలో పెరిగిన ఉత్తీర్ణత



కొండాజి



లక్ష్మిభార్గవి



కళ్యాణ్



శ్రావని

రావికమతం: కొత్తకోట జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో గతేడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాది ఫస్టియర్‌లో 16 శాతం రాగా, ఈ ఏడాది 78 మందికి 34 మంది పాసై 43 శాతం ఫలితాలు వచ్చాయి. సెకండియర్‌లో గతేడాది 36 శాతం, ఈ ఏడాది 165 మందికి 101 మంది పాసై 61 శాతం ఫలితాలు సాధించారు. అత్యధికంగా ఫస్టియర్ విద్యార్థులు జి.కొండాజి 448, పి.లక్ష్మీభార్గవి 442, సెకండియర్ లో విసారపు కల్యాణ్ 908, కె.శ్రావని 904 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సాయకుమార్ తెలిపారు.

తగ్గిన ఉత్తీర్ణత శాతం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఫైనలియర్‌లో రెగ్యులర్ కోర్సులకు 354 మంది పరీక్షలకు హాజరు కాగా 26.27 శాతం ఉత్తీర్ణతతో 93 మంది మాత్రమే గట్టెక్కారు. వీరిలో ఎంపీసీ కోర్సు చేసిన 105 మందికి గాను 19 మంది ఉత్తీర్ణులై 18 శాతం, బీపీసీ 88 మందికిగాను 26 మంది పాసై 29.55 శాతం, సీఈసీలో 67 మందికిగాను 13 మంది పాసై 20 శాతం, హెచ్ఈసీలో 97 మందికిగాను 35 మంది పాసై 36 శాతాన్ని నమోదు చేశారు. ఒకేషనల్ కోర్సులో కాస్త మెరుగైన ఫలితాలు సాధించారు. 136 మంది పరీక్ష రాయగా 57మంది పాసై 42 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఒక ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఫలితాలు మరీ దిగజారాయి. రెగ్యులర్ కోర్సులకు 232 మంది పరీక్షలు రాయగా 34 మంది మాత్రమే పాసై 14.66శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సుల్లో 166 మందికిగాను 41మంది పాసై 25 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒక్క బీపీసీ కోర్సులో మాత్రమే రెండంకెల్లో 17 మంది ఉత్తీర్ణులు కాగా, మిగిలిన కోర్సుల్లో సింగిల్ డిజిట్‌లో మూడు కోర్సులకు సంబంధించి 17 మంది మాత్రమే పాసయ్యారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మే 3వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ వి.జి.కె.చైనులు తెలిపారు.

వడ్డాదిలో..

బుచ్చెయ్యపేట: వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 119 మందికి గాను 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సర పరీక్షల్లో 72 మందికి 13 మంది మాత్రమే పాసయ్యారు.

10 తాగునీటి బోర్లకు సామగ్రి పంపిణీ



రైతులకు బోరు హెడ్‌లు అందిస్తున్న సూర్యనారాయణ తదితరులు

చీడికాడ: అర్జునగిరిలో పది కళ్లాల్లో తాగునీటి బోర్లకు సామగ్రిని విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి.రమాదేవి మాట్లాడుతూ పది కళ్లాలకు చెందిన రైతులు తాగునీటి సమస్య తీర్చాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు వినతి పత్రాలు అందించామన్నారు. దీనికి స్పందించి పంచాయతీ నిధుల నుంచి 9 బోర్లు, ఎంపీపీ గ్రాంట్ నుంచి ఒక బోరు తవ్వించారన్నారు. వీటికి బోరు హెడ్, ఇతర సామగ్రిని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ అందించారన్నారు. ఈ మేరకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు పెంటకోట రామునాయుడు(శేషు), పెద్దలు కొవిలపల్లి పైడిబాబు, పెంటకోట పెదరామునాయుడు, అగ్రపు చిన్నంనాయుడు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతిసాగుతో ఆదాయం



ర్యాలీ చేస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మాకవరపాలెం: ప్రకృతి సాగుపై రైతులు దృష్టి సారించాలని సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ కోరారు. గురువారం కొండలఅగ్రహారం గ్రామంలో ప్రకృతి సాగుపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రకృతి సాగుతో రైతులకు పెట్టుబడి తగ్గడంతోపాటు అధిక దిగుబడి, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందన్నారు. నవధాన్యాల సాగు– నేలతల్లి బాగు అనే అంశంపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు, కవిత, సుదర్శన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంగీత శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: శాస్త్రీయ సంగీత నృత్యంతో విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తి పెరుగుతుందని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. శ్రీగీత సంగీత ప్రచార మండలి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ (మెయిన్)లో ఏర్పాటు చేసిన ఉచిత సంగీత శిక్షణ తరగతులను డీఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోపాటు విద్యార్థుల్లో సంగీత నృత్యంలో ప్రావీణ్యం పెంపొందించుకోవడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. సంగీత నృత్యం విలువలతో ముడిపడి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. శిక్షణ తరగతుల నిర్వాహకురాలు ఆచంట రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

30న మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ



వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న బూరె బాబూరావు

దేవరాపల్లి: బోయిలకింతాడలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఈ నెల 30 ఆవిష్కరించనున్నట్లు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, టీడీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు. దీంతోపాటు నూతన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారన్నారు. రూ.20 కోట్లతో చేపట్టే కాశీపురం–బోయిలకింతాడ రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేస్తారన్నారు. బోయిలకింతాడ, గవరవరం రెవెన్యూల పరిధిలో రూ.15 కోట్లుతో నిర్మించిన వంతెనను ప్రారంభిస్తారన్నారు.

మొక్కలు పెంచండి



పరిశీలిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

మాడుగుల: జాబ్ కార్డుదారులకు గిట్టుబాటు అయ్యేటట్టు ఉపాధి పనులు కలించాలని ఎంపీడీవో మీనాకుమారి సూచించారు. అవురువాడ పంచాయతీలో ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. మస్తర్ల వెరిఫికేషన్ చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు రాయితీపై అందజేయాలన్నారు. మొక్కలు పెంచాలన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: చౌడువాడ శివారు గరుగుబిల్లికి చెందిన అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా పూజలతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారికి వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆకుల సాయి ప్రసాద్, రొంగలి రమేష్, చల్లా సురేష్ ప్రత్యేక పూజలు చేశారు.

మరిడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం పాలగెడ్డ వద్ద మరిడిమాంబ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపుకుంకుమలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నుంచి ఆలయం వద్ద భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేగి అమ్మతల్లినాయుడు (గాంధీ) పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా ఉపాధి పనులు



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



సామగ్రిని ఉపాధి గ్రూపు సభ్యులకు అందిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

బుచ్చెయ్యపేట: వేసవి ఎండల దృష్ట్యా ఉపాధి వేతనదారులు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సువర్ణరాజు, ఏపీవో మురళి తెలిపారు. గురువారం వడ్డాది పాండవుల చెరువులో కూలీలకు వైద్య సిబ్బంది సమక్షంలో అవగాహన కల్పించారు. పంచాయతీల్లో ఉదయం 4 గంటలకే కుళాయినీరు సరఫరా చేయాలన్నారు. నీళ్లు పట్టుకుని ఉదయం 5 గంటలకే పని ప్రాంతానికి వచ్చి 9 గంటలకే ముగించాలని సూచించారు. మంచినీళ్లు, మజ్జిగ, గెంజి వంటి ద్రావణాలు వెంట తెచ్చుకోవాలన్నారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే స్థానిక ఆస్పత్రికి వచ్చి తగిన వైద్య సేవలు పొందాలన్నారు. వీఆర్పీ మేట్లుకు ఓఆర్ఎస్, మందులు అందించారు. ఈసీ కొండాజీ, హెచ్‌వీ అమ్మాజి, ఏఎన్ఎం కనకలక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడు: జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు కల్పించాలని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ తెలిపారు. పాచిలవానిపాలెంలోని రామసాగరం చెరువులో పూడికతీత పనులు చేస్తున్న వేతనదారుల గ్రూపు సభ్యులకు తన సొంత నగదుతో కొలతల టేపులు, వేలిముద్రణ బాక్స్‌లతోపాటు ఇతర సామగ్రిని గురువారం ఆయన పంపిణీ చేశారు. చినగరుగుబిల్లి, బంటు వారి కళ్లాలు, పాచిలవానిపాలెం గ్రామాలకు చెందిన ఉపాధి గ్రూపు సభ్యులకు వీటిని అందించడంతోపాటు వేతనదారులకు మజ్జిగ పంచారు. ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్, వార్డు మెంబర్ గండి సత్యనారాయణ, వీఆర్పీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చిన్నారులు ఎండ బారిన పడకుండా చర్యలు



బుచ్చింపేట సెక్టార్ సమావేశంలో కార్యకర్తలు

రోలుగుంట: అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక జూనియర్ కళాశాలలో బుచ్చింపేట సెక్టార్ సూపర్‌వైజర్ అపర్ణ, స్థానిక ఎంపీపీ పాఠశాలలో రోలుగుంట సెక్టార్ సూపర్‌వైజర్ పెట్ల సత్యవతి వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఆయా కేంద్రాల నిర్వహణకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. దీనిలో భాగంగా కేంద్రాలకు వస్తున్న చిన్నారులు ఈ వేసవిలో ఎండలు బారిన పడకుండా ఆయాలతోపాటు టీచర్లు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు.

30న మహిళలకు ముగ్గుల పోటీలు

అనకాపల్లి టౌన్: ఈ నెల 30న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరాట్ల నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 30 వరకు వాసవీ నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో భాగంగా వారి వారి స్వగృహంలో ముగ్గుల్ని వేసి ఫొటోలు తీసి 8019508033 వాట్సాప్ చేయాలని కోరారు.